క్లుప్తంగా

పంటల పరిశీలన



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక): మండలంలోని బండారుపల్లిలో బుధవారం వివిధ పంటలను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశోధనా సంచాలకులు రఘురాంరెడ్డి పరిశీలించారు. గ్రామ రైతులు బాలస్వామిరెడ్డి అధిక సాంద్రత పద్ధతిలో సాగుచేసిన పత్తి, మల్లవ్వ సాగు చేసిన వరిని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు (వరంగల్) ఉమారెడ్డి, తోర్నాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు శ్రీదేవి, పల్లవి, విజయ్ కుమార్, ఏఓ మోహన్, ఏఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో విశ్రాంత ఉద్యోగులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ పాత బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 10వ రోజు దీక్షలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కూర్చున్నారు. ఈసందర్భంగా రూ. 5,116 విరాళం అందించారు. దీక్షను జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ ప్రారంభించగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, జేఏసీ ప్రతినిధి ఆగంరెడ్డి, అశోక్, అంజయ్య, నాగరాజు, మల్లేశం, రాము, శ్రీకాంత్, ప్రసాద్, రాజిరెడ్డి, సిద్దయ్య, కేశవులు సంఘీభావం తెలిపారు.

ఐఓసీలోకి రికార్డులు



తరలించేందుకు సిద్ధంగా రికార్డులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్‌లో ఐఓసీని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించడంతో అందులోకి వెళ్లేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల రికార్డులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త కార్యాలయానికి వెళ్లే వరకు రైతుల భూ సమస్యల అర్జీలను పక్కన పెట్టారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కోటమైసమ్మ వద్ద చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కోట మైసమ్మ దేవాలయం చుట్టూ విస్తరణ పనులతో పాటు కోటగోడల మాదిరిగా అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, ఏఈ ధనరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమయానుగుణంగా బస్సులు నడపాలి

సిద్దిపేటరూరల్: విద్యార్థుల సకాలంలో కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లేందుకు ఉదయం సమయంలో ప్రత్యేక బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ అన్నారు. బుధవారం మండలపరిధిలోని రాఘవాపూర్ ప్రధాన చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో అఖిల్, నిఖిల్, సురేశ్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి

హుస్నాబాద్‌రూరల్: మహిళలు కుట్టు శిక్షణతో ఉపాధి పొందాలని సర్పంచ్ బత్తిని సాయిలు సూచించారు. పోతారం(ఎస్) గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చి బుధవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సంస్థ ధ్రువీకరణ పత్రాలను అందించినట్లు చెప్పారు.

ఓటరు జాబితాపై అవగాహన

హుస్నాబాద్: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఓటర్ జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ జాబితాపై రాజకీయ ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. సమావేశంలో నాయకులు కేడం లింగమూర్తి, వంగ వెంకట్రాంరెడ్డి, అన్వర్ పాష, మల్లికార్జున్ రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

వీగిపోయిన అవిశ్వాసం

- సమావేశానికి హాజరుకాని రేబర్తి పీఏసీఎస్ సభ్యులు



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

మద్దూరు(హుస్నాబాద్): రేబర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నాగిళ్ల తిరుపతి రెడ్డి, వైస్‌చైర్మన్ ఇర్రి రాజిరెడ్డిపై పెట్టిన అవిశ్వాసం పాలకవర్గ సభ్యుల గైర్హాజరుతో బుధవారం వీగిపోయింది. గత నెల 21వ తేదీన తొమ్మిది మంది పాలకవర్గ సభ్యులు జిల్లా సహకార శాఖ అధికారికి అవిశ్వాస తీర్మానం అందజేశారు. దీంతో ఈనెల 19న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తూ డీసీఓ నోటీసులు జారీ చేశారు. అందుకు అనుగుణంగా మద్దూరులోని సొసైటీలో ఏర్పాటు చేసిన సమావేశానికి 8 మంది సభ్యులు హాజరయ్యారు. రేబర్తిలో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులను సభ్యులు నిలదీయగా సమావేశాన్ని ఒక రోజు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి బుధవారం రేబర్తి సొసైటీ గోడౌన్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అవిశ్వాస తీర్మానంపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఏ ఒక్క పాలకవర్గ సభ్యుడు సమావేశానికి హాజరుకాకపోవడంతో చైర్మన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లుగా డీసీఓ కరుణ ప్రకటించారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సంఘం కార్యకలాపాలను రేబర్తి కేంద్రంలోని కొనసాగించాలని పలువురు రైతులు డీసీఓ కరుణకు వినతిపత్రం అందించారు. అలాగే సొసైటీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని.. కొత్తది ఏర్పాటు చేయాలని కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



కొమురవెల్లి: మాట్లాడుతున్న సీడీపీఓ శారద

- ఐసీడీఎస్ సీడీపీఓ శారద

కొమురవెల్లి(సిద్దిపేట): చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శారద సూచించారు. బుధవారం కొమురవెల్లి సెక్టార్‌కు చెందిన బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మహిళల్లో పోషణ లోపాన్ని తగ్గించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌ను పోషణ మాసంగా ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లత, జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, సూపర్‌వైజర్ పావని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ఆర్ఐ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రాయపోలు(దుబ్బాక): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని రాయపోలు ఎంపీపీ కల్లూరి అనిత అన్నారు. రాయపోలులో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహారాజ్, జెడ్పీటీసీ యాదగిరి, ఏఎంసీ చైర్మన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తిరగలేకపోతున్నాం..

- మండల సమావేశాన్ని బహిష్కరించిన ఎంపీటీసీలు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

కొండపాక(గజ్వేల్): మండల సర్వసభ్య సమావేశాన్ని అధికారి పార్టీ ఎంపీటీసీలు బహిష్కరించారు. కొండపాకలోని రైతు వేదికలో ఎంపీపీ ర్యాగల్ల సుగుణ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. మొదటగా వ్యవసాయశాఖ అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చింతల సాయిబాబా మాట్లాడుతూ.. ఎంపీటీసీలను ప్రభుత్వం నిధులు, విధుల్లో చులకనగా చూస్తుందని వాపోయారు. దీనికి మర్పడ్గ ఎంపీటీసీ పత్తి ఆంజనేయులు, చిట్యాల హరితారెడ్డి, మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి, గురజాడ బాలాజీ మద్దతు తెలిపారు. అనంతరం ప్లకార్డులతో నిరసనకు దిగారు. ఎంపీటీసీలకు నిధులు, విధులు దక్కిన తర్వాతే సమావేశానికి హాజరవుతామని ఎంపీపీ సుగుణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఏదైనా సమస్య ఉంటే మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకుందామంటూ ఎంపీపీ సర్దిచెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ పనితీరుతో గ్రామాల్లో తిరగలేకపోతున్నామని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. సమావేశంలో రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య, ఎంపీడీఓ రాంరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ములుగు ఎంపీపీ లావణ్య



ప్రగతి నివేదికను చదువుతున్న అధికారిణి

ములుగు(గజ్వేల్): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ములుగు ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ సూచించారు. బుధవారం ములుగు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కొక్కొండ సర్పంచ్ బంగ్ల గణేష్ మాట్లాడుతూ.. గ్రామ వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎంపీపీ లావణ్య, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి మాట్లాడుతూ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు లింగా రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అక్టోబర్ 1న మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

సిద్దిపేటకమాన్: అక్టోబర్ 1వ తేదీన మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేట ఏసీపీ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ముస్లిం మత పెద్దలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 1న ర్యాలీ నిర్వహించాలని సూచించడంతో వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ.. హిందువులు, ముస్లింలు ఆనందంగా పండుగలు జరుపుకోవాలన్నదే తమ ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి, టూటౌన్ సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

మర్కూక్ మండల అభివృద్ధికి నిధులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని వివిధ గ్రామాల్లో కొత్త అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల కోసం రూ. 4.5 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ పాండుగౌడ్ తెలిపారు. బుధవారం మర్కూక్‌లో ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణయాదవ్, ధనలక్ష్మి, సర్పంచ్‌లు అశోక్, భాగ్య, గాయత్రి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సిద్దిపేటఅర్బన్: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ముదిరాజ్ సంఘాల నాయకులు అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులోని టీహెచ్ఆర్‌నగర్ కాలనీ సమీపంలో నిర్మిస్తున్న ముదిరాజ్ భవన్ పనులను పరిశీలించి ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 268 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంతా వారే.. మారని తీరు!

- సక్రమంగా సాగని నారాయణరావుపేట మండల సమావేశాలు



మాట్లాడుతున్న ఎంపీపీ బాలకృష్ణ

సిద్దిపేటరూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో నారాయణరావుపేట మండల సర్వసభ్య సమావేశాలు నేటి వరకు సక్రమంగా జరిగిన దాఖలాలు లేవు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ అంతంత మాత్రంగానే జరిగింది. మండలవ్యాప్తంగా 10 గ్రామాలు ఉన్నప్పటికీ ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరు కాగా, గ్రామాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తీసుకురాలేకపోయారు. ఎంపీడీఓ మురళీధర్‌శర్మ పూర్తిస్థాయిలో ప్రగతి నివేదికను తయారు చేయకపోవడంతో సభ్యులు ఎంపీపీని ప్రశ్నించారు. ఈక్రమంలో మైక్ తీసుకున్న ఎంపీడీఓ సభను ముగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. మండలంలోని శనగకుంట, శేఖర్‌రావుపేట కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పడడం సంతోషకరమన్నారు. సమావేశం అనంతరం ప్రగతి నివేదికలపై ఎంపీఓ, ఎంపీడీఓకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటు చేసుకుంది. వైస్ ఎంపీపీ సంతోష్, మండల సమన్వయ సమితి అధ్యక్షుడు బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై హర్షం



సిద్దిపేట: మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా మోర్చా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట): పార్లమెంట్‌లో మహిళలకు రిజర్వేషన్ ప్రకటిస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టిన ప్రధాని మోదీ ఫ్లెక్సీకి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేటలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండ్ల జనార్దన్, కనకరాజు, సుగుణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లి మండల కేంద్రంలో నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ జిల్లా అసెంబ్లీ కోకన్వీనర్ లక్ష్మారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాబు, అనిల్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

Sd/- Y. CHANDRA RUSHI, B.Sc., LL.B.
Advocate
1-2-273, Opp: Court Building, Brundavan Colony,
JANGAON. Dist: Jangaon. Cell: 9848430920

'కాంగ్రెస్, బీజేపీలకు భంగపాటు తప్పదు'

చేర్యాల(సిద్దిపేట): రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు భంగపాటు తప్పదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలుచేయని పథకాలను తెలంగాణలో అమలుచేస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేంద్రం తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదని వాపోయారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భక్తుల ప్రత్యేక పూజలు

బొజ్జ గణపయ్యా.. పూజలందుకోవయ్యా..

వినాయక నవరాత్రి ఉత్సవాలు జిల్లావ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి గరకమాలలు, ఎలక్కాయలు, పూలు, పండ్లు, ఇతర పిండి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు.



గజ్వేల్ పట్టణంలో..



నంగునూర్‌లో..



గజ్వేల్: పూసలతో వినాయకుడి రూపం

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

గజ్వేల్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ రమేష్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలిసి బుధవారం వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపల్ ఆధ్వర్యంలో చెరువు కట్టల వద్ద తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు. గణపయ్యల ఊరేగింపును త్వరగా చేపట్టి ఎవరికీ ఇబ్బంది తలెత్తకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్‌చైర్మన్ జకియొద్దీన్, సీఐలు జాన్‌రెడ్డి, రంగకృష్ణ, తిరుపతి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

దుబ్బాక: దుబ్బాక ఐటీఐ కళాశాలలో గురువారం నుంచి 23వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ సన్మానం

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం సన్మానించి మొమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, నంగునూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం కనకయ్య, సుధాకర్, నాగార్జునరెడ్డి, పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

◆ సోషల్ మీడియా రాష్ట్ర సెక్రటరీగా వెంకటేశం

వర్గల్(గజ్వేల్): కేసీఆర్ సేవాదళం రాష్ట్ర సోషల్ మీడియా సెక్రటరీగా మండలంలోని నెంటూరుకు చెందిన బాణపురం వెంకటేశం నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం కేసీఆర్ సేవాదళం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ అమీర్‌హుస్సేన్ నియామకపత్రాన్ని అందజేశారు.

◆ పండ్ల మొక్కల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్‌లో బుధవారం ఇంటింటికి పండ్ల, పూల మొక్కల పంపిణీ చేపట్టారు. సర్పంచ్ జయవర్ధన్ రెడ్డి ఎంపీటీసీ సభ్యులు బాలయ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ ఆలయ అభివృద్ధికి కృషి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి లక్ష్మీనర్సింహస్వామి గుట్ట అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ కనగండ్ల కవిత పేర్కొన్నారు. బెజ్జంకిలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ 15వ ఫైనాన్స్ నిధుల నుంచి ఆలయం వద్ద మహిళా భక్తుల కోసం రూ. 6 లక్షలు వెచ్చించి సామూహిక టాయిలెట్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

◆ 'సరస్వతి సేవలు మరువలేనివి'

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని చిన్నగుండవెల్లి ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ మెరుపుల సరస్వతి సేవలు మరువలేనివని జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, వైస్ ఎంపీపీ యాదయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల అకాల మరణం పొందిన సరస్వతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ 'మాట నిలుపుకుంటాం'

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసి మాట నిలుపుకుంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనేక హామీలను ఇచ్చి అమలు చేయని పార్టీ బీఆర్ఎస్ అన్నారు.

◆ పోరాట ఫలితంగానే మహిళా బిల్లు

సిద్దిపేటజోన్: ఎమ్మెల్సీ కవిత పోరాట ఫలితంగానే మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చిందని సిద్దిపేట భారత జాగృతి అధ్యక్షుడు శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో కవితను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ బ్యాగుల పంపిణీ

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఎస్ఐ నాగరాజు అన్నారు. బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌరాయపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కార్యవర్గం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని తంగళ్లపల్లి కిష్టమ్మ స్వామి గుట్టపై బుధవారం కోహెడ ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా లక్ష్మణ్, అధ్యక్షుడిగా ముని, ప్రధాన కార్యదర్శిగా ముక్కల హరీష్, ఉపాధ్యక్షులు రాగుల సతీష్, తదితరులు ఎన్నికయ్యారు.

◆ పరామర్శ

సిద్దిపేటకమాన్: ఈనెల 12వ తేదీన చిన్నకోడూర్ మండలం అనంతసాగర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇందూర్ కళాశాల విద్యార్థి నాగరాజు కుటుంబాన్ని సిద్దిపేట పట్టణంలో మంత్రి హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. ఆ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని.. అధైర్యపడొద్దని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు గుడాల శ్రీకాంత్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990